www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 6 మే 2025
5
పశ్చిమ గోదావరి



చెట్ల కింద ఉండొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

పిడుగుల ధాటికి మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని, వర్షం సమయంలో చెట్ల కింద ఎవరు నిలబడి ఉండకూడదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల కారణంగా పడుతున్న పిడుగుల వల్ల ప్రాణాలను కోల్పోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా వ్యవసాయ భూముల్లో పనిచేసేవారు ఈ విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. చెట్ల కింద నిలబడడం కన్నా బహిరంగ ప్రదేశంలో ఉంటేనే పిడుగుల నుండి రక్షించుకోగలుగుతామని తెలిపారు. పిడుగులు పడుతున్న సమయంలో సెల్ ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లో మాట్లాడకూడదని తెలిపారు. ఏయే ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఉందో ముందస్తుగా వాతావరణ శాఖ ద్వారా సెల్ ఫోన్ సందేశాలు పంపడం జరుగుతుందని, సెల్ ఫోన్‌లకు సందేశం వెళ్లని సమయంలో దగ్గరగా ఉన్నట్లయితే నేరుగా వెళ్లి ప్రజలను అప్రమత్తం చేయాలని మండల అధికారులకు సూచించారు.

అక్కడి అధికారులకు ఏమైంది..!

కోర్టు ఆదేశాలు ధిక్కరించి ఇళ్ల కూల్చివేత

పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో కోర్టు స్టే ఇచ్చిన ఇళ్లనూ కూల్చేసిన అధికారులు

ఒక ప్రాంతంలో స్టే విధిస్తే అదే ప్రాంతంలో అదే సమస్యకు స్టే వర్తించినా పట్టని అధికారులు

రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారుల తీరుపై సర్వత్రా చర్చ

శిథిలాల మధ్య జీవనం సాగిస్తున్న ఎఎస్ఆర్ నగర్ వాసులు



ఎఎస్ఆర్.నగర్‌లో బరకాలతో పందిరి వేసుకొని జీవిస్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి - భీమవరం

ప్రజాస్వామ్య వ్యవస్థలో సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను ప్రతిఒక్కరూ గౌరవిస్తారు.. తుచ తప్పకుండా పాటిస్తారు. దీనిలో ప్రభుత్వ అధికారుల పాత్ర చాలా కీలకం. అయితే సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను సైతం ధిక్కరించింది వాటిని పాటించాల్సిన అధికారులే అయితే. ఇదే పరిస్థితి పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లోని ఇళ్ల కూల్చివేతలో స్పష్టంగా కన్పిస్తోంది. కోర్టు స్టే విధించినా కనీసం పట్టించుకోకుండా బుల్డోజర్లతో ఇళ్లను ధ్వంసం చేయడంపై సర్వత్రా చర్చ సాగుతోంది. దీనికి మండలాధికారులు బాధ్యత వహిస్తారా, లేక జిల్లా అధికారులే మూల్యం చెల్లించుకుంటారా అనే చర్చ కూడా పెద్దఎత్తున సాగుతోంది.

1986 నుంచి ఎఎస్ఆర్ నగర్ ప్రాంతంలో జనం నివాసముంటున్నారు. 108 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నాయి. అయితే ఈ ఇళ్లకు చేర్చి ఉన్న రాజు కాలువ కలుషితమవుతుందనే పేరుతో వీటిని తొలగించే చర్యలను అధికారులు మూడు నెలల క్రితం చేపట్టారు. దీంతో 53 కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయి. ఆ ఇళ్లకు కోర్టు స్టే విధించింది. సుమారు 46 ఇళ్లను అధికార యంత్రాంగం కూల్చేసింది. వీటితోపాటు కోర్టు స్టే ఇచ్చిన మరో మూడు ఇళ్లను సైతం రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు దగ్గరుండి మరీ కూల్చివేయించారు. తమ ఇళ్లను తొలగించొద్దని, దానికి కోర్టు స్టే ఇచ్చిందని సంబంధిత కుటుంబీకులు చెప్పినా అధికారులు పట్టించుకోలేదు. కనీసం కోర్టు ఆదేశాలను పరిశీలించకుండా ఇళ్లను కూల్చివేయడం వెనుక ఆంతర్యం ఏమిటా అనే చర్చ కూడా సాగింది. ఒకవేళ పెద్దల ఒత్తిడి ఉన్నా కోర్టుకు ఏం చెబుతారని, అధికారులకు కోర్టు ఆదేశాలు పట్టవా అనేది అందరినీ తొలిచేస్తున్న ప్రశ్న. దీనికితోడు ఒక ప్రాంతంలో ఒక సమస్యపై కోర్టు స్టే కొందరికి ఇస్తే, అక్కడ అదే సమస్యపై అందరికీ స్టే వర్తిస్తుందనేది సహజ న్యాయ స్వభావ సూత్రంగా పెద్దలు చెబుతుంటారు. అయితే సంబంధిత అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా దుందుడుకుగా వ్యవహరించి ఇళ్లను తొలగించడం, పైగా ఇదేమిటని ప్రశ్నించిన మహిళలపై మగ పోలీసులు జులుం ప్రదర్శించి మానవ హక్కులను ఉల్లంఘించడం ఎవరి ప్రాపకం కోసమో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో కోర్టు స్టే ఉన్నా అధికారులు ఇళ్లు తొలగించిన బాధిత కుటుంబాలను ప్రజాశక్తి పలుకరించింది. వారి ఆవేదన వారి మాటల్లోనే..



నా చిన్నప్పటి నుంచి ఎఎస్ఆర్ నగర్‌లోనే నివాసం ఉంటున్నాను. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాం. రూ.5 లక్షలు వెచ్చించి రేకుల షెడ్డు వేసుకున్నాం. ఈ ఇంట్లోనే మా నాన్న, అమ్మ, మా తమ్ముడు, మరదలు, నేను, నా భార్య మొత్తం మూడు కుటుంబాలు ఉండేవారం. మూడు నెలల క్రితం అధికారులు వచ్చి ఇంటిని తొలగిస్తున్నట్లు నోటీసు ఇచ్చారు. ఇదేమని అడిగితే కాలువ కాలుష్యం అవుతుందని, ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించుకున్నారని, అందుకే తొలగిస్తున్నామని చెప్పారు. ఏం చేయాలో తెలీక కోర్టును ఆశ్రయిస్తే కొన్ని రోజులపాటు గడువు ఇచ్చింది. మరోసారి అధికారులు ఇళ్లు తొలగిస్తున్నట్టు నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేస్తే తీసుకోలేదు. అధికారులు ఇంటి తలుపునకు నోటీసు అంటించి వెళ్లిపోయారు. మళ్లీ కోర్టును ఆశ్రయిస్తే స్టే విధించింది. అయితే అధికారులు మాత్రం ఇవేమీ పట్టించుకోలేదు. తమ ఇంటికి స్టే ఉందని చెప్పినా వినకుండా పది మంది పోలీసులు జెసిబితో వచ్చి కళ్ల ముందే కూల్చేశారు. కనీసం ఒక పోర్షన్ అయినా ఉంచమని వేడుకున్నా నిర్ధాక్షిణ్యంగా కూల్చేశారు. మూడేళ్ల కుమార్తె జయశ్రీ, ఏడాదిన్నర కుమారుడు లక్కీ బాలాజీతో ఎక్కడికి వెళ్లాలో తెలీక ఇక్కడే కాలువ గట్టున బరకం కట్టుకుని సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోజనం శిబిరంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం చేసి ఇక్కడే నివాసం ఉంటున్నాం' అని కన్నీటి పర్యంతమయ్యాడు.

- జుత్తిగ నాగమల్లేశ్వరరావు, వెంకటలక్ష్మి దంపతులు



మా ఇంటిని ఎంతో చక్కగా నిర్మించుకున్నాం. ఎఎస్ఆర్ నగర్‌కు వచ్చిన ప్రతిఒక్కరూ ఇల్లు చాలా బాగుంది అనేవారు. రోజువారీగా ఆటో నడుపుకుంటూ రూపాయి రూపాయి కూడబెట్టి కొంత మొత్తంలో అప్పు చేసి ఉన్నదంతా ఇంటి నిర్మాణానికే ఖర్చు చేశాం. నాకు ఇద్దరు కుమార్తెలు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రూ.25 లక్షలు ఖర్చు చేసి నిర్మించుకున్నాం. దీని నిమిత్తం రూ.15 లక్షలు అప్పు ఉంది. దీనిని ప్రతినెలా వాయిదాల రూపంలో చెల్లిస్తున్నాం. 40 ఏళ్ల నుంచి ఎవరికీ అడ్డు లేకుండా ఇక్కడే బతుకుతున్నాం. అప్పటి నుంచి లేని కాలువ కాలుష్యం ఇప్పుడు వచ్చిందని, ఇల్లు తొలగిస్తామని అధికారులు చెబితే కోర్టును మూడుసార్లు ఆశ్రయించాం. కోర్టు స్టే విధించి ఇంటిని యధావిధిగా ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది. అధికారులు ఇదేమి పట్టించుకోకుండా 15 మంది పోలీసులను పంపించి భయభ్రాంతులకు గురిచేసి కూల్చేశారు. కనీసం ఇంటిలో ఉన్న సామాన్లు కూడా తెచ్చుకునే సమయాన్ని కూడా ఇవ్వలేదు. కనీస కనికరం లేకుండా కళ్ల ముందే నిర్ధాక్షిణ్యంగా ఇంటిని తొలగించారు. ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వలేదు. ఉన్న ఇంటిని కూల్చేసింది. దిక్కుతోచని పరిస్థితుల్లో పాలకోడేరులో రూ.5 వేలు చెల్లించి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం', అని వాపోయారు.

- మల్లుల వెంకటేశ్వరరావు, పెద్దింట్లు దంపతులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆమె జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 149 అర్జీలను స్వీకరించారు. పూర్తి అంగవైకల్యం కలిగిన బిడ్డను ఎత్తుకొని వచ్చిన దంపతుల వద్దకు కలెక్టర్ స్వయంగా వెళ్లి పాప అంగవైకల్యంపై ఆరా తీశారు. అర్హతకు కావలసిన ధ్రువపత్రాలను, బిడ్డ వాస్తవ పరిస్థితులను పరిశీలించి రూ.15 వేలు మంజూరుకు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని డిసిహెచ్ఎస్‌ను ఆదేశించారు. తక్షణ పరిష్కారానికి వీలుగాని అర్జీలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారాన్ని చూపించాలని తెలిపారు. కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వికలాంగురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ఇళ్ల కూల్చివేత ఆపాలని నేడు బహిరంగ సభ

భీమవరం పాత బస్టాండ్ ప్రాంగణంలో సాయంత్రం 3 గంటలకు

హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల కూల్చివేతను ఆపాలని కోరుతూ మంగళవారం భీమవరం పాత బస్టాండ్ ప్రాంగణంలో సాయంత్రం మూడు గంటలకు సిపిఎం ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ తెలిపారు. మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బహిరంగ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యవక్తగా హాజరవుతున్నారన్నారు. వామపక్షాల, ప్రజాసంఘాల, దళిత సంఘాల నాయకులు, అన్ని రాజకీయపక్షాల నాయకులు హాజరై ఈ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. జిల్లాలోనూ, ఉండి నియోజకవర్గంలో ఏళ్ల తరబడి ప్రభుత్వ పోరంబోకు భూముల్లో నివాసం ఉంటున్నారో వారంతా ఈ బహిరంగ సభకు తరలిరావాలన్నారు. 150 గజాల్లోపు ఎవరైతే పేదలు ఇళ్లు కట్టుకుని నివశిస్తున్నారో వారికి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ మధ్యే దానికి ఉత్తర్వులు కూడా ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీనే అమలు చేయమని కోరుతున్నామన్నారు. ఉండి నియోజకవర్గంలో లేని కాలుష్యాన్ని పేదలపై రుద్ది ఇళ్లు తొలగిస్తున్నారన్నారు. ఇళ్ల కూల్చివేతను ఆపాలని ఉండి ఎంఎల్ఎను, అధికారులను కోరుతున్నామన్నారు. కాలుష్యం ఎవరి వల్ల, దేనివల్ల అవుతుందో వెలికితీద్దాం, నిర్ధారిద్దాం అన్నారు. కాలుష్యం ఉంటే దాని నివారణ మార్గాలు ఏమిటో ఆలోచించి తదుపరి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒకవేళ పేదల ఇళ్లు అనివార్యంగా తీసేయాల్సి వస్తే వారికి ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూల్చేయడం అన్యాయమని, అనాలోచిత చర్యని అన్నారు. ఉండి నియోజకవర్గంలో జరుగుతున్న దుర్మార్గం జిల్లాలో మరెక్కడా జరగకుండా బాధితులు, ప్రజలంతా బహిరంగ సభకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

7న ఒకరోజు నిరాహార దీక్ష

పేదలపై ఉండి ఎంఎల్ఎ జులుంను ఖండిస్తూ నిరసన

దీక్షలో పాల్గొనున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్, బాధిత ప్రజలు

మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని పరిస్కరించుకుని ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు పేదలపై చేస్తున్న దౌర్జన్యాన్ని ఖండిస్తూ ఒకరోజు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ తెలిపారు. పేదల కోసం, బ్రిటీష ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు కోల్పోయిన అల్లూరి సీతారామరాజు గడ్డపై ఉండి ఎంఎల్ఎ పేదలపై చేస్తున్న దౌర్జన్య, దాష్టికాన్ని వ్యతిరేకిస్తూ బాధితులతో సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు నిరాహార దీక్ష చేస్తున్నట్లు తెలిపారు.

డిఎస్‌సిలో బ్యాక్‌లాగ్.. పోస్టులేవీ..!

ముస్లిం మైనార్టీ (బిసి-ఇ) కేటగిరి అభ్యర్థులకు తీరని నష్టం

2024 వైసిపి ప్రభుత్వం జారీ చేసిన డిఎస్‌సిలో ఉన్న బ్యాగ్‌లాగ్ పోస్టులు

తాజా డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఆ పోస్టులు మాయం

బ్యాక్‌లాగ్ పోస్టులున్నా.. లేనట్టు జిల్లా విద్యాశాఖ పంపిన జాబితానే కారణం

గుడ్డి, చెవుడు కేటగిరి బ్యాక్‌లాగ్ పోస్టుల్లోనూ అదే నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి జారీ చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో బిసి-ఇ (ముస్లిం మైనార్టీ) కేటగిరికి తీరని నష్టం కన్పిస్తోంది. జిల్లా విద్యాశాఖ అధికారుల తప్పిదంతో ముస్లిం మైనార్టీ కేటగిరిలో పది ఎస్‌జిటి పోస్టులు, గుడి, చెవుడు అంగవైకల్య కేటగిరిలో దాదాపు 15 పోస్టులు కోల్పోయిన పరిస్థితి. జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలకు సంబంధించి రాష్ట్ర కేంద్రానికి ఇచ్చిన నివేదికలో జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ సమస్య తలెత్తిననట్లు తెలుస్తోంది. దీంతో తమ కేటగిరికి సంబంధించిన బ్యాక్‌లాగ్ పోస్టులను డిఎస్‌సి నోటిఫికేషన్‌లో పొందుపరచాలంటూ బిసి-ఇ సామాజిక తరగతిలో అర్హులైన అభ్యర్థులంతా కోరుతున్నారు. 2014లో టిడిపి ప్రభుత్వ హయాంలో డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేసింది. ముస్లిం మైనార్టీ (బిసి-ఇ) కేటగిరికి సంబంధించి మొత్తం 36 పోస్టులను పొందుపరిచింది. వాటిలో పురుషులకు 24, మహిళలకు 12 పోస్టులు ఉన్నాయి. డిఎస్‌సి పరీక్షలో 26 మంది మాత్రమే అర్హత సాధించారు. దీంతో ఎనిమిది మహిళ, రెండు పురుషులకు సంబంధించిన ఖాళీలు అలానే ఉండిపోయాయి. 2018లో మరోసారి డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ జిల్లా, మండల పరిషత్ స్కూళ్లలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు లేనట్లు చూపించారు. దీంతో బ్యాక్‌లాగ్ పోస్టులు చూపించలేదని అప్పట్లో చెప్పుకొచ్చారు. 2022లో తక్కువ సంఖ్యలో 550 బ్యాక్‌లాగ్ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి వైసిపి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. తక్కువ సంఖ్యలో ఇచ్చిన కారణంగా 2014లో మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ పోస్టుల ఖాళీలు చూపించకుండా వదిలేశారు. 2024లో ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వం 6,100 ఖాళీలతో డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో వంద ఎస్‌జిటి పోస్టులు అందులో ఉన్నాయి. ముస్లిం మైనార్టీలకు సంబంధించి బిసి-ఇ కేటగిరిలోని గతంలో మిగిలిపోయిన పది బ్యాక్‌లాగ్ పోస్టులను చూపించారు. దీంతో ఆ సామాజిక తరగతి అభ్యర్థులంతా ఆనందపడ్డారు. 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసిపి ప్రభుత్వం జారీ చేసిన డిఎస్‌సిని రద్దు చేసింది. మెగా డిఎస్‌సి పేరుతో 2025 ఏప్రిల్ 20న నూతనంగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1,035 పోస్టులకు సంబంధించి ఖాళీలను నోటిఫికేషన్‌లో చూపించారు. ఇందులో 420 ఎస్‌జిటి పోస్టులు ఉన్నాయి. ఇందులో బిసి-ఇ కేటగిరిలో ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కింద 16 పోస్టులు మాత్రమే ఖాళీలు చూపించారు. గతంలో మిగిలిన బ్యాక్‌లాగ్ పది పోస్టులను చూపించలేదు. నిబంధనల ప్రకారం వాటిని కూడా కలిపి 26 పోస్టులు చూపించాల్సిన ఉన్నప్పటికీ అలా జరగలేదు. ఉర్దూ పోస్టులకు సంబంధించి మూడు బ్యాక్‌లాగ్ పోస్టులను చూపించి సరిపెట్టారు. దీంతో బిసి-ఇ సామాజిక తరగతికి సంబంధించిన అభ్యర్థులు ఈ డిఎస్‌సిలో పది పోస్టులను కోల్పోయిన పరిస్థితి నెలకొంది. జిల్లా విద్యాశాఖాధికారులు బ్యాక్‌లాగ్ పోస్టుల వివరాలను రాష్ట్ర కేంద్రానికి పంపకపోవడమే ఈ తప్పిదానికి కారణమని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విజువల్, ఇయరింగ్ బ్యాక్‌లాగ్ పోస్టుల్లోనూ అదే నిర్లక్ష్యం

2014 డిఎస్‌సిలో విజువల్ (గుడ్డి) కేటగిరిలో 24 పోస్టులకుగాను ఆరు మాత్రమే భర్తీ చేశారు. ఇంకా 18 పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. ఇయరింగ్ (చెవుడు) కేటగిరిలో 11 పోస్టులకు నాలుగు మాత్రమే భర్తీ చేయగా ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహిళలకు సంబంధించి ఇదే కేటగిరిల్లో పది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 35 బ్యాక్‌లాగ్ పోస్టులు ఉన్నప్పటికీ ప్రస్తుత డిఎస్‌సిలో చూపించలేదు. 2022లో చూపించిన 15 పోస్టులకు సంబంధించి కోర్టులో కేసు పెండింగ్ ఉన్నప్పటికీ మిగిలిన 15 పోస్టులు కూడా చూపించని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు చూపించొద్దన్నారు..

ఎం.వెంకటలక్ష్మమ్మ, డిఇఒ

బ్యాక్‌లాగ్ పోస్టులపై కోర్టులో ఉండటం కారణంగా చూపించొద్దన్నారు. అందుకే ప్రస్తుత డిఎస్‌సిలో చూపించలేదు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీచేసేటప్పుడు వీటిని భర్తీ చేస్తారు. 2024 వైసిపి ప్రభుత్వంలో ఇచ్చిన డిస్‌సిలో పొందుపరిచిన పోస్టులు, 2025 డిఎస్‌సిలో ఎందుకు లేవన్న ప్రశ్నకు మాత్రం డిఇఒ నుంచి సరైన సమాధానం రాని పరిస్థితి నెలకొంది. కోర్టులో ఉన్నది గుడ్డి, చెవుడు బ్యాక్‌లాగ్ పోస్టులకు సంబంధించినవని, ముస్లిం మైనార్టీ బిసి-ఇ కేటగిరికి సంబంధించినవి కావుగా అనే ప్రశ్నకు డిఇఒ సమాధానం ఇవ్వలేదు.

ఆచరణాత్మక సిద్ధాంత రూపకర్త.. మార్క్స్

సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం



మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ఆచరణాత్మక సిద్ధాంత రూపకర్త కారల్ మార్క్స్ అని సిపిఎం రాష్ట్రనేత మంతెన సీతారాం అభివర్ణించారు. స్థానిక సుందరయ్య భవనంలో మార్క్స్ జయంతి సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి మంతెన సీతారాం, నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ మార్క్స్‌తో పోల్చతగిన ప్రపంచ మేధావులు ఎవరూ లేరన్నారు. ప్రపంచాన్ని ప్రభావితం చేసే మానవాళికి కార్మిక, కర్షకులకు ఆచరణాత్మక సిద్ధాంతాన్ని మార్క్స్ రూపొందించారన్నారు. ఇది కాలం చెల్లే సిద్ధాంతం కాదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ మార్క్స్, ఎంగెల్స్ కలిపి రూపొందించిన సిద్ధాంతం మార్క్సిజం అన్నారు. ఆపై రష్యా నేత లెనిన్ అభివృద్ధి పర్చడంతో లెనినిజంగా ప్రసిద్ధి చెందిందన్నారు. ప్రపంచంలో దోపిడీ, అసమానతలతో కూడుకున్న పెట్టుబడీదారి వ్యవస్థను కూలదోసి ప్రపంచంలో సోషలిజాన్ని నిర్మించే సిద్ధాంతమే మార్క్సిజం, లెనినిజం అని అన్నారు. పెట్టుబడీదారి వ్యవస్థ అధికారంలోఉన్న ప్రపంచ దేశాల్లో అసమానతలు, నిరుద్యోగం, శాంతి కరువయ్యాయన్నారు, ఆకలి మంటలు పెరిగాయన్నారు. కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న దేశాలైన చైనా, క్యూబా, వియత్నాం, కొరియా, లావోస్‌లో ఉన్న ప్రజలు సుఖసంతోషాలతో బతుకుతున్నారన్నారు. నిరుద్యోగం వంటి సమస్యలను వారు రూపుమాపారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు జె.సత్యనారాయణ, కె.క్రాంతిబాబు, నేతలు మల్లిపూడి ఆంజనేయులు, పోతుల మృత్యుంజయ, కె.రత్నకుమారి, మెరెపె లత తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో రూ.కోట్లలో రుణాలు..!

సెంట్రల్‌బ్యాంకులో ఘరానా మోసం - లబోదిబోమంటున్న భూ యజమానులు

పోలీసుల అదుపులో బ్యాంకు మేనేజర్

ప్రజాశక్తి - నరసాపురం

చేపల చెరువుల నకిలీ లీజు అగ్రిమెంట్లతో స్థానిక సెంట్రల్ బ్యాంకులో పెద్దఎత్తున రుణాలు తీసుకున్న ఘరానా మోసం సోమవారం వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నరసాపురం మండలం వేములదీవి వెస్ట్ సర్దుకొడప గ్రామానికి తిరుమాని నాగరాజు కుటుంబ సభ్యుల పేరిట సుమారు 19 ఎకరాల భూమిపై సుమారు రూ.4 కోట్ల రుణాలు నకిలీ లీజుపత్రాలతో తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై బాధితుడు నాగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తన వ్యాపారాల నిమిత్తం పట్టణంలోని ఓ ప్రయివేట్ బ్యాంకుకు లోన్ కోసం వెళ్లానని, అయితే నరసాపురం సెంట్రల్ బ్యాంకులో మీ పేరిట రుణాలు ఉన్నాయని ఆ బ్యాంకు అధికారులు చెప్పారన్నారు. దీంతో తాను తన సోదరుడు శ్రీనివాస్‌తో కలిసి సెంట్రల్ బ్యాంకుకు వెళ్లి బ్యాంకు మేనేజర్ టి.ప్రకాశంను అడగ్గా లోను తీసుకున్న వ్యక్తులను అడగాలి అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారన్నారు. తమ భూములపై వేరే వాళ్లకు రుణాలు ఎలా ఇస్తారని, అసలు రుణం ఎవరికిచ్చారో తెలపాలని తిరుమాని నాగరాజు, శ్రీనివాస్ బ్యాంకు మేనేజర్‌ను నిలదీశారు. దీంతో బ్యాంకులో గందరగోళం నెలకొనడంతో సమాచారం అందుకున్న ఎస్ఐలు సిహెచ్.జయలక్ష్మి, ఎస్ఎన్.ముత్యాలరావు బ్యాంకు వద్దకు చేరుకుని ఇరుపక్షాలతో మాట్లాడారు. రుణ పత్రాలను పరిశీలించారు. వెంటనే బ్యాంకు మేనేజర్ ప్రకాశం సదరు రుణం పొందిన ఇద్దరిలో ఒకరైన కూనపురెడ్డి ప్రసాద్‌ను బ్యాంకుకు పిలిపించారు. తాను సుమారు రూ.8 కోట్ల విలువైన ఆస్తి కాగితాలు పెట్టి కొప్పినీడి మాధవ్ అనే వ్యక్తి ద్వారా రూ.2.36 కోట్లు రుణం పొందినట్లు కూనపురెడ్డి ప్రసాద్ తెలిపారు. ఈ అక్రమ చేపల చెరువులు లీజు అగ్రిమెంట్ విషయం తనకు సంబంధం లేదని, అంతా బ్యాంక్ సిబ్బంది, ఆ వ్యక్తి చూసుకుని రుణం మంజూరు చేశారని తెలిపారు. 2024లో తిరుమాని పద్మావతి పేరిట ఐదు ఎకరాలు, తిరుమాని వడ్డికాసులు నాలుగెకరాలు చేపల చెరువుల పేరిట దూదే చంద్రశేఖర్ అనే వ్యక్తి రూ.1.36 కోట్లు రుణాలు పొందారన్నారు. 2020లో తన తండ్రి వడ్డికాసులు చనిపోయారని, చనిపోయిన వ్యక్తి పేరిట రుణాలు ఎలా ఇచ్చారని తిరుమాని నాగరాజు ప్రశ్నించారు. చనిపోయిన వ్యక్తి సంతకాలు ఫోర్జరీ చేసి రుణాలు పొందినట్లు తెలుస్తుందన్నారు. తిరుమాని నాగరాజు, తిరుమాని శ్రీనివాస్ పేరిట ఉన్న 10 ఎకరాల భూమిపై రూ.2.36 కోట్లు రుణాలు కూనపురెడ్డి ప్రసాద్ పొందారన్నారు. తమ భూమిపై ఉన్న రుణాలు రద్దు చేసి, బాధ్యులైన అధికారులు, బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఉన్నతాధికారుల పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని, మరికొన్ని అక్రమాలు బయట పడతాయని బాధితుడు నాగరాజు కోరారు. దీంతో సెంట్రల్ బ్యాంకు మేనేజర్ ప్రకాశంను పోలీసులు అదుపులోకి తీసుకుని టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.



పత్రాలు పరిశీలిస్తున్న పోలీసులు

ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి - అత్తిలి

ఉపాధి కూలీల కడుపు కొట్టి కాంట్రాక్టర్ల జేబులు నింపుతున్న ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని ఎపి కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడులో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలను వారు సోమవారం కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా మార్క్స్ 207వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్, వీరభద్రరావు మాట్లాడుతూ ఉపాధి కూలీల జాబ్‌కార్డుల సంఖ్యకు తగినట్లు బడ్జెట్లో రూ.2.40 లక్షల కోట్లు నిధులు కేటాయించాల్సి ఉందని, అయితే బిజెపి అధికారం చేపట్టిన తర్వాత గత మూడు సంవత్సరాలుగా కేవలం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీలకు సమ్మర్ అలవెన్స్, తాగునీరు, పనిముట్లు, ఎండ నుండి కాపాడుకోవడానికి టెంట్లు వంటి సౌకర్యాలను కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం తొలగించిందని వారు గుర్తు చేశారు. పని ప్రదేశంలో చనిపోయిన కూలీలకు కేవలం రూ.50 వేలు మాత్రమే చెల్లిస్తుందని విమర్శించారు. పని ప్రదేశంలో చనిపోయిన ప్రతి కూలీకి రూ.10 లక్షలు పరిహారం అందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తానుకొండ సుష్మ, జోషి బాయ్, తానుకొండ ప్రవీణ్‌కుమార్, పద్దాలు, శేషారావు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జువ్వలపాలెంలో భగీరథుని జయంతి

ప్రజాశక్తి - కాళ్ల

సగర కుల గురువు భగీరథ మహర్షి జయంతి వేడుకలను జువ్వలపాలెంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సగర సంఘం ఛైర్మన్ కమిటీ సభ్యులు బోధనపు వెంకటేశ్వరరావు, బోధనపు కన్నయ్య, పెద్దిరాజు, రాంబాబు, గండికోట నరసింహమూర్తి, కనకం, నక్కా శ్రీను, దొణాద్రి పద్రాజు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు న్యాయవాదుల అవగాహన

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని సరిపల్లిలో సోమవారం ఉపాధి హామీ కింద పనిచేస్తున్న రోజువారీ కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్యానెల్ న్యాయవాదులు డి.నరసింహారావు, డి.చాముండేశ్వరి పాల్గొని అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ ఇ శ్రమ వెబ్ పోర్టల్లో నమోదు చేసుకుని కార్డు కలిగి ఉండాలన్నారు. ప్రమాదవశాత్తు అనుకోని సంఘటనలు జరిగినప్పుడు నష్టపరిహారం పొందడానికి ఇ శ్రమ కార్డు ఉపయోగపడుతుంది. అలాగే 14 ఏళ్లలోపు పిల్లలచేత ఎటువంటి కూలి పని చేయించకూడదు. బాలల చేత పని చేయిస్తే తల్లిదండ్రులకు, యజమానికి కార్మిక చట్టం ద్వారా జరిమానా, జైలు శిక్ష విధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఎం.వెంకట లక్ష్మీపతి, పిఎల్వి ఎం.ప్రభాకరరావు పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులు సోమవారం 8వ రోజు ఉత్సాహంగా జరిగినట్లు గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. రిసోర్స్ పర్సన్ గరికపాటి బాపయ్య విద్యార్థులకు డొక్కా సీతమ్మ గురించి వివరించారు. అన్ని దానాల్లో అన్నదానం ముఖ్యమైనదని డొక్కా సీతమ్మ భావించే వారని తెలిపారు. జన్యారావు విద్యార్థులకు వేమన పద్యాలు, తాత్పర్యం వివరించారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణ తరగతులు జూన్ 6వ తేదీ వరకూ జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం : ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం వద్ద గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పండ త్రినాథ్, సైంటిస్ట్ సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన వేసవి విజ్ఞాన తరగతుల్లో ఎంఇఒ పుష్పరాజ్యం పాల్గొని పుస్తక పఠనంపై వివరించారు. బుక్ రీడింగ్ ఒక ఫ్రెండ్లా అలవాటు చేసుకోవాలి. రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు రాజ్యలక్ష్మి విజ్ఞాన తరగతులను సందర్శించి పిల్లలకు ఐక్యమత్యమే బలం, జడ్జి గారి ఇద్దరు కొడుకులు కథలను ఆసక్తికరంగా చెప్పారు. డాక్టర్ చినమిల్లి శ్రీనివాస్ హెచ్ఆర్డి డైరెక్టర్ వైఎన్ కాలేజ్ వారు పిల్లలకు సింధుత అనే అమ్మాయి జీవిత కథను వివరించారు.

పెనుమంట్ర : పిల్లలు అందరు ఆరోగ్యం గురించి తెలుసుకోవాలని రిటైర్డ్ తహశీల్దార్ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. మార్టేరు శాఖా గ్రంథాలయంలో జరిగిన వేసవి విజ్ఞాన శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పిల్లలకు పలు ఆరోగ్య విషయాలు వివరించారు. ఎం.వేద, సిహెచ్.రేవంత్, ఎం.రాంచరణ్ టి.రఘు నందన్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం : తహశీల్దార్

ప్రజాశక్తి - ఆచంట

అకాల వర్షాల కారణంగా మండలంలో ఎక్కడైనా ధాన్యం తడిసి దానివల్ల ఇబ్బంది కలిగితే రైతులు రైతు సేవ కేంద్రం వద్ద సంప్రదించాలని తహశీల్దార్ జి.కనకరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రైతులు అదనంగా పండించిన ధాన్యానికి ఎగస్ట్రా టార్గెట్ను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. మండలంలో ధాన్యం కొనుగోలులో లోపాలుంటే మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని ఆయన కోరారు.

కళాశాల వార్షిక పత్రిక విడుదల

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు, అధ్యాపకుల స్పందనలతో కూడిన కళాశాల వార్షిక పత్రిక 'ఎక్స్ప్రెషన్స్'ను కళాశాల కమిటీ సభ్యులు కొండేటి నారాయణరావు, కొమ్ముల మురళి, డిఆర్ యుసిసి సౌత్ సెంట్రల్ రైల్వే మెంబర్ జక్కంపూడి కుమార్ సోమవారం ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి మాట్లాడుతూ విద్యార్థినుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీయాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరమూ పత్రికను ప్రచురిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

కౌలురైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పెనుమంట్ర

అకాల వర్షాలకు, ఈదురు గాలులకు మండల రైతులు నష్టపోయారని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు అన్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మండలంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్కె అధికారులు తేమ శాతం తీసిన వెంటనే గోనె సంచులు అందుబాటులో ఉంచి, సకాలంలో ఇచ్చినట్టయితే ప్రస్తుతం స్థానిక రైతులకు ఈ పరిస్థితి ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అవసరమైన టార్పాలిన్లు (బరకాలు) ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆదిరెడ్డి సన్యాసిరావు, తానుకొండ దుర్గారావు, ఇళ్ల మధుసూదన్రావు, కుక్కల రాము, ఆదిరెడ్డి బుచ్చులు, ఇళ్ల జయలక్ష్మి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు

సావిత్రమ్మ పోరాటాలు చిరస్మరణీయం

ఐద్వా ఆధ్వర్యాన వర్ధంతి సభ

ప్రజాశక్తి - ఆకివీడు

కార్మిక, మహిళా నేతగా ఎం.సావిత్రమ్మ చేసిన పోరాటాలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. సావిత్రమ్మ 4వ వర్ధంతి సభ స్థానిక 14వ వార్డులో ఐద్వా ఆధ్వర్యాన సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సావిత్రమ్మ చిత్రపటానికి ఆమెతో కలిసి పని చేసిన బంక లక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానికులు, మాజీ వైస్ ఎంపిపి డోకల లక్ష్మి సావిత్రమ్మ చిత్రపట వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డోకల లక్ష్మి, సందక ఉదయకుమారి మాట్లాడుతూ సావిత్రమ్మ కార్మిక సమస్యల పరిష్కారానికి నిరంతరం తపించేవారని, కేవలం పని ప్రాంతాల్లో వచ్చే సమస్యలపైనే కాకుండా నివాస ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పోరుబాట సాగించేవారని గుర్తు చేశారు. అదే సమయంలో మహిళల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించేవారని, సావిత్రమ్మ కృషి అందరికీ ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో జివి.లావణ్య, చుక్కా లక్ష్మి, ఎ.పద్మావతి, విమల, శాంతి, కొవ్వాడ సత్యవతి, నాగమణి, గుమ్మళ్ల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బీచ్లో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్లో ఆదివారం సముద్ర స్నానం చేస్తూ గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైందని ఎస్ఐ జి.వాసు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యలమంచిలి మండలం అబ్బిరాజుపాలేనికి చెందిన వలవల దివ్యశ్రీ రామ పవన్ కుమార్ (21) భీమవరంలోని డిఎన్ఆర్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 4న 8 మంది మిత్రులతో కలిసి బీచ్కు వచ్చాడు. ఈ క్రమంలో సముద్రస్నానం చేస్తూ అలల తాకిడికి లోనికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. గాలిస్తుండగా మొల్లపర్రు బీచ్లో అతని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ తెలిపారు. దీనిపై పవన్ కుమార్ సోదరుడు శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. పవన్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.

రైతుకు పాముకాటు

ప్రజాశక్తి - ఆచంట

పెదమల్లంలో సోమవారం రెవెన్యూ అధికారులు పంట పొలాలను రీసర్వే చేస్తున్న నేపథ్యంలో పెదమల్లం గ్రామానికి చెందిన రైతు ఆదిమూలం మాచిరాజును వంజరం పాటు కాటు వేసింది. దీంతో హుటాహుటీన రెవెన్యూ అధికారులు, కుటుంబ సభ్యులు ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ వైద్యాధికారి డాక్టర్ పూజ ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం నిమిత్తం పాలకొల్లు ఏరియా హాస్పిటల్కు తరలించారు. అక్కడ వైద్యాధికారులు మాచిరాజుకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించి అబ్జర్వేషన్లో ఉంచారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ జి.కనకరాజు, విఆర్ఒ శేషగిరి, రెవెన్యూ సిబ్బందితోపాటు పెదమల్లం గ్రామానికి చెందిన గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. అత్యంత విషపూరితమైన వంజరం పాములు 1986 వరదలకు ఆచంట మండలంలోని పెదమల్లం, కొడమంచిలి, కోడేరు, కరుగోరుమిల్లి భీమలాపురం ప్రాంతాలకు వచ్చాయి. ఈ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు చేయాలంటే ప్రజలు భయపడిపోతుంటారు.

30 గంటలు అంధకారంలోనే..

ఈదురుగాలులు, వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం - ఉండిలో విద్యుత్ పునరుద్ధరణలో అధికారులు విఫలం

ప్రజాశక్తి - ఉండి

ఈదురుగాలులు, భారీ వర్షాల నేపథ్యంలో 30 గంటల పాటు ఉండి మండలం అంధకారంలోనే ఉండని, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో అధికారులు విఫలమయ్యారని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. గతంలో విశాఖపట్నంలో హుద్ హుద్ తుపాను నేపథ్యంలో 24 గంటల్లోనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించారని, మండలంలో ఆదివారం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి అధికారులకు 30 గంటలైనా సరిపోలేదని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం టెక్నాలజీ అభివృద్ధి చెందిన నేపథ్యంలో సెల్ఫోన్ లేకుండా జీవనం సాగించడం ఇబ్బందికరంగా మారిందని, అటువంటిది 30 గంటల పాటు విద్యుత్ సరఫరా స్తంభించిపోతే సెల్ఫోన్ల ఛార్జింగ్తో పాటు సిగ్నల్స్ కూడా లేకుండా పోయాయని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా లేకపోవడం తమ వ్యాపారానికి ఆటంకంగా మారిందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో మండలంలోని చాలా ప్రాంతాల్లో మెయింటెనెన్స్ పేరిట ఉదయం నుంచి సాయంత్రం వరకూ విద్యుత్ లైన్లకు అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలను, చెట్లను తొలగించినప్పటికీ ఈదురుగాలులకు ఏ విధంగా తీగలు తెగిపడ్డాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. గృహ అవసర వినియోగదారులకు విద్యుత్ అందించడంలో విఫలమైన విద్యుత్ సిబ్బంది ఆదివారం రాత్రి పులిగుమ్మ ప్రాంతంలోని ఆక్వా చెరువులపై విద్యుత్ సరఫరా పునరుద్ధరించే పనిలో ఉన్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆక్వా రైతులతోపాటు తాము కూడా బిల్లులు చెల్లిస్తున్నామని తమకు విద్యుత్ సరఫరా చేయలేని అధికారులు ఆక్వా రైతులకు ఏ విధంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నారని ప్రశ్నించారు. ఇదే విషయమై అధికారులకు ఫోన్ చేస్తే సరైన సమాధానం చెప్పడం లేదని విమర్శించారు. ఉండి పెదపుల్లేరు రహదారిలోని తీగలు ఆదివారం ఉదయం తెగిపోయినప్పటికీ విద్యుత్ సిబ్బంది సోమవారం మధ్యాహ్నం వరకూ వాటిని పరిశీలించకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. గత ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజినీర్ ముదునూరి మాధవరాజు మండలంలో వేసవిలో విద్యుత్ కోతలు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యుత్తు అందించాలని లక్ష్యంతో పనిచేశారని కానీ నేడు వినియోగదారులకు విద్యుత్ అందించడంలో ప్రస్తుత అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని దీనివల్ల సోమవారం మండలంలోని పలు బ్యాంకులలో లావాదేవీలు సైతం నిలిచిపోయాయని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ వినియోగదారులకు కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని పలువురు కోరుతున్నారు.

గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

పిజిఆర్ఎస్లో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం ఆర్డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 36 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సిపిఎం నాయకులు మహాలక్ష్మి మృతి

ప్రజాశక్తి - గణపవరం

సిపిఎం సీనియర్ నాయకుడు కేశవరం శాఖా సభ్యులు తోట మహాలక్ష్మి అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మహాలక్ష్మి 1991 నుంచి తుదిశ్వాస విడిచే వరకూ సిపిఎంలో, వ్యవసాయ, రైతు, ప్రజాసంఘాల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మహాలక్ష్మికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని, వారికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ కార్యదర్శి పెచ్చేట్టి నరశింహమూర్తి, నాయకులు చిన్నం చిన నాగేశ్వరరావు, ఎం.పెంటారావు, నరాలశెట్టి రామకృష్ణ ఆయన భౌతికకాయానికి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. నాయకులు చిన్న చిట్టియ్య, తోట ఏసు, ఇంజేటి ప్రభాకరరావు, మండ భాస్కరరావు పాల్గొన్నారు.

వాండ్రంలో సూపర్ శానిటేషన్

ప్రజాశక్తి - ఉండి

తమ గ్రామంలో ప్రజల ఆరోగ్యం కోసం సూపర్ శానిటేషన్ పనులు నిర్వహించినట్లు వాండ్రం గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం కురిసిన భారీ వర్షాలకు గ్రామంలో ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తమ గ్రామంలో సూపర్ శానిటేషన్ నిర్వహించినట్లు తెలిపారు. పారిశుధ్యం క్షీణించిన ప్రాంతాల్లో దగ్గరుండి శానిటేషన్ పర్యవేక్షించడం జరిగిందని తెలిపారు. గ్రామంలో ఎవరైనా వైరల్ ఫీవర్ బారిన పడితే వెంటనే హెల్త్ క్లినిక్ సిబ్బందికి గానీ, పంచాయతీ దృష్టికి గాని తీసుకురావాలని కోరారు.

కారల్ మార్క్స్కు నివాళి

ప్రజాశక్తి - ఆచంట

పెట్టుబడిదారులు సాగిస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు, కష్టజీవులను ఐక్యం చేసి శాస్త్రీయమైన సిద్ధాంతాన్ని రూపకల్పన చేసిన మహనీయులు కార్ల్ మార్క్స్ అని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్రావు అన్నారు. కార్ల్ మార్క్స్ 207వ జయంతిని సోమవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్వివిఎన్.శర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత కారల్ మార్క్స్ చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు తోటపల్లి సత్యన్నారాయణ, తలుపురి బుల్లబ్బాయి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు ఎస్వివిఎన్.శర్మ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు తలుపూరి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, సీనియర్ నాయకులు బండి రంగారావు, చదలవాడ చంటిబాబు, టి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం : ఎంఎల్ఎ రాధాకృష్ణ

తణుకు: అకాల వర్షాల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంఎల్ఎ రాధాకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను అవహేళన చేసి, వారిని ఎర్రిపప్ప అని దుర్భాషలాడిన మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం రైతుల కోసం మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. గత ప్రభుత్వంలో రూ.1600 కోట్లు ధాన్యం బకాయిలు ఉంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు చెల్లించినట్లు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసి ఇంటికి వెళ్లేలోపు వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. తణుకు నియోజకవర్గంలో సుమారు 43 వేల ఎకరాల్లో 1,35,712 టన్నుల ధాన్యం సాగవుతోందని దీనిలో ఇప్పటి వరకు 84,802 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించి 8,941 మంది రైతులకు రూ.173కోట్లు చెల్లించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో లక్ష్యానికి అనుగుణంగా దాదాపు 27 లక్షలకు పైగా గోనె సంచులు అందించడం జరిగిందని, రాబోయే రెండురోజుల్లో మరో 3లక్షల గోనె సంచులు అందించనున్నట్లు తెలిపారు. రైతులకు వారధిగా ఉండి రైతులకు రైసుమిల్లర్లు సహకరించాలని కోరారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం

డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు పనులకు సంబంధించి పిలిచిన టెండర్లు, అజెండాలో తప్పుల తడక, పనుల అంచన ఎక్కువుగా వేయడంపై జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశం రసాభసాగా సాగింది. సోమవారం ఛైర్పర్సన్ బర్రె శ్రీ వెంకట రమణ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. టిడిపి, స్వతంత్ర, వైసిపి సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ పట్టుబట్టారు. సమావేశం ప్రారంభం కాగానే స్వతంత్ర సభ్యులు కోటిపల్లి సురేష్ అజెండాలోని అంశాలపై ప్రస్తావించారు. సభ్యులకు పంపిన అజెండాలోని తప్పులను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమం లో కేసరి గంగరాజు సిల్ట్ పనుల టెండర్ల కీని 12 రోజుల వరకు ఎందుకు తెరవలేదంటూ నిలదీశారు. దీంతో సభలో గందరగోళం ఏర్పడింది. ఇదే అంశంపై వైసీపీ సభ్యులు నఖినేటిపల్లి సురేష్, వంగా శ్రీకాంత్ కన్నా నిలదీశారు. దీనికి జనసేన సభ్యులు అరుణ, కృష్ణవేణి, సూర్యకుమారి, సురేష్, అభ్యంతరం తెలిపారు. పనులు జరగనివ్వాలని విన్నవించారు. అయితే తాము పనులకు వ్యతిరేఖం కాదని, నిబంధనల్ని తుంగలోకి తొక్కారని సభ్యులు ప్రతి దాడికి దిగారు. దీంతో సభలో గందరగోళం ఏర్పడింది. ఈ దశలో విసి కొత్తపల్లి నాని మాట్లాడారు. వర్షాలు పడే సమయంలో పనులు ఎలా చేపడతారన్నారు. టెండర్ల కీ జాప్యంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. దీనికి మిగిలిన సభ్యులంతా మద్దతు పలికారు. కమిషనర్ అంజయ్య వల్లే జాప్యం జరిగిందని తేలడంతో అతనిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం

డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రఘురామకృష్ణరాజు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. దొడ్డనపూడిలో రూ.28 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను రఘురామకృష్ణరాజు సోమవారం ప్రారంభించారు. పల్లెపాలెం ప్రాంతంలో ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో 290 మీటర్ల పొడవున నిర్మించిన రోడ్డును ఆయన ప్రారంభించారు. అలాగే శివాలయం సమీపంలో మండల పరిషత్ నిధులతో 93 మీటర్ల పొడవున నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కొల్లి సుబ్బారావు, ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, మాజీ ఎంపిపి ఆరేటి వెంకటప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జి జుత్తుగ నాగరాజు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు రూ.35 వేల వేతనం ఇవ్వాలి

జిల్లా కలెక్టర్కు ఎఐటియుసి నేతలు వినతి

భీమవరం : ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో పనిచేస్తున్న కాంటాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి నెలకు రూ.35 వేల కనీస వేతనం ఇవ్వాలని, డాక్టర్ ఆక్టాయిడ్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. చిన్న కుటుంబం గడవాలంటే కనీసంలో కనీసం నెలకు రూ.35 వేలు పైబడి ఖర్చు అవుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కలిశెట్టి వెంకట్రావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఎఐటియుసి నాయకుడు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

నరసాపురం: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ 58 డిమాండ్లలో ఉద్యోగ భద్రత 1/19 సర్క్యులర్ను అమలు చేయాలని, మహిళ ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులను ఇప్పించాలని కోరుతూ సోమవారం తహశీల్దార్ ఐవివి సత్యనారాయణ, ఆర్డిఒ దాసిరాజుకు యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిబ్బంది కొరతను మెరుగుపర్చాలని, లీవ్ పొజిషన్ మెరుగుపర్చాలని, కొత్త ఉద్యోగాలు కల్పించాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని గ్యారేజీలో మెకానిక్లపై పనిభారం తగ్గించాలని కోరారు. 5వ దఫాగా రాష్ట్రవ్యాప్తంగా సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో రీజనల్ ఛైర్మన్ జి.సతీష్బాబు, డిపో సెక్రటరీ తోట ప్రసాద్, డిపో ప్రెసిడెంట్ నిషారుద్దీన్, కమిటీ సభ్యులు ఎస్ఎస్.రావు, ఇవి.రావు హాజరయ్యారు.

వినతులపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఫిర్యాదుదారుల వద్దకెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వారి వద్దనున్న సంబంధిత పత్రాలను పరిశీలించారు. అధికారులు ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, శానిటరీ మేస్త్రి కిషోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి చెరువు నీరు పరిశీలన

ఉండి: పబ్లిక్ కుళాయిల ద్వారా గ్రామ పంచాయతీ ప్రజలకు అందించే నీరు మురుగు వాసన వచ్చి, పసర్లతో నిండి ఉందనే ఆరోపణల నేపథ్యంలో రక్షిత మంచినీటి సరఫరా డిప్యూటీ ఇంజినీర్ తానింకి శ్రీనివాసరావు, సహాయక ఇంజినీర్ కె.హరనాధ్ రాజు ఉండిలోని తాగునీటి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిని పరీక్షించేందుకు నీటి నమూనాలను పాలకొల్లు పంపించామని, ప్రస్తుతం నీటి సరఫరాలో ఎటువంటి తేడాలు లేవని, నిబంధనల మేరకు నీటిని శుద్ధిచేసి సరఫరా చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ఫిల్టర్ కానీ నీటిని సరఫరా చేయొద్దని, శుద్ధి కానీ జలాలను పబ్లిక్ కొళాయిల ద్వారా సరఫరా చేసినట్లయితే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జనసేనలోకి వైసిపి ఎంపిటిసి సత్యవతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కూటమి నాయకత్వంపై నమ్మకంతో వలసలు పెరుగుతున్నాయని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక క్యాంపు ఆఫీసులో మండలంలోని పట్టింపాలెం వైసిపి ఎంపిటిసి జాంపల్లి సత్యవతి ఎంఎల్ఎ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రధానంగా పల్లెల్లో స్వేచ్ఛా వాయువులు ప్రసాదించిన కూటమి ప్రభుత్వాన్ని ఇష్టపడి పలువురు వైసిపి ఎంపిటిసి, జెడ్పిటిసిలు పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు మంచి చేసేందుకే ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా పనిచేయాలని కోరారు. నూతనంగా కూటమిలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీకి వారు చేసిన సేవలను గుర్తించి అధిష్టానం తగిన ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, పాలూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అందుబాటులో గోనె సంచులు

పెనుమంట్ర: మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులకు అవసరమైన గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి అడబాల జ్యోషిలా సోమవారం తెలిపారు. ఇప్పటివరకూ మండలంలో 8 లక్షల 26 వేల సంచులు రైతులకు ఇచ్చామని, ఇంకా 2 లక్షల 46 వేల సంచులతో పాటు, అదనంగా 50 వేల సంచులు ఉంచామని ఆమె పేర్కొన్నారు. ఇప్పటివరకూ మండలంలో రైతుల ద్వారా 3 లక్షల 3 వేల 42 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం రైతులు బాగా ఆరిన, కొద్దిగా తడిగా ఉన్న ధాన్యాన్ని కలిపి సంచులకు ఎత్తకుండా, విడివిడిగా వేయాలన్నారు.

జాతీయ బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గణేష్ భవాని

ప్రజాశక్తి - పాలకొల్లు

జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పాలకొల్లుకు చెందిన ముద్దాడ గణేష్ భవాని నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నుంచి భవాని హైదరాబాద్లో నియామక పత్రం అందుకున్నారు. ప్రస్తుతం భవాని సంఘానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా ఉన్నారు. తనను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యకు భవాని కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు పట్టణ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్ల డాక్టర్లు, ఎఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎం.ఇ వెంకటరమణ, మేనేజర్ రవి సుధాకర్, ఎఎస్ఒ సురేష్, అర్బన్ హెల్త్ సెంటర్ల డాక్టర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ యేసుబాబు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి నేపథ్యంలో పట్టణ ప్రజలు ఆరోగ్యం విషయంలో డాక్టర్ల సలహాలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్య సదుపాయాలు, రక్త పరీక్షలు, మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కాళ్లలో కళావేదిక ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లలో గ్రామ దేవతలు మహంకాళమ్మ, వెంకమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పెంటపాటి పుల్లయ్య, సత్యవతిల కుమారుడు పెంటపాటి వెంకట నాగేశ్వరరావు, వరలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో రూ. ఐదు లక్షలతో నిర్మించిన కళావేదికను ఎంఎల్ఎ ప్రారంభించారు. కార్యక్రమంలో జుత్తిగ నాగరాజు, తోట ఫణిబాబు, ఎం.మాధవరావు, జివి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజయవాడ ప్రత్యేక కోర్టుకు మంత్రి రామానాయుడు

పాలకొల్లు : నాటి వైసిపి ప్రభుత్వం అరెస్ట్ చేసి నిర్బంధించిన ఆశా వర్కర్లకు సంఘీభావం తెలిపినందుకు నాడు అక్రమ కేసు బనాయించిన నేపథ్యంలో విజయవాడ ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు సోమవారం మంత్రి రామానాయుడు హాజరయ్యారు. 2019 ఆగస్టులో వైసిపి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించిన ఆశా వర్కర్లకు న్యాయ పరంగా అండగా నిలిచిన మంత్రి రామానాయుడుతో పాటు పలువురు పార్టీ శ్రేణులపై అక్రమ కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి రామానాయుడు కోర్టుకు హాజరయ్యారు.

ఎంపిడిఒ రవీంద్ర సేవలు ఎనలేనివి : తహశీల్దార్

ఉండి: ఉండి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.రవీంద్ర సేవలు ఎనలేనివని తహశీల్దార్ కావడి నాగార్జున అన్నారు. సోమవారం సాయంత్రం మండలం పరిషత్ కార్యాలయంలో ఇన్ఛార్జి ఎంపిడిఒ సిహెచ్ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో వీడ్కోలు సభ నిర్వహించారు ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహశీల్దార్ నాగార్జున మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉండి వచ్చిన రవీంద్ర అనతి కాలంలోనే మండల అభివృద్ధికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఎంపిడిఒ రవీంద్ర మాట్లాడుతూ తాను పనిచేసిన కాలంలో తనకు సహకరించిన ప్రతి ఒక్క అధికారికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యుఎస్ ఎఇ కె.హరినాథరాజు, వెలుగు ఎపిఎం రాజేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

భీమవరం టౌన్: పాఠశాల విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాల సమస్యలు పరిష్కరించాలని టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం మాట్లాడారు. సుమారు రూ.30 వేల కోట్ల ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించాలని, బకాయి పడ్డ మూడు డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జి.ప్రసన్నకుమార్, భీమవరం మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నరసాపురంలో అన్నదానం

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని శ్రీ ఆదికేశవ ఎంబర్ మన్నారు స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు, తిరునక్షత్ర ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఆలయ ఆవరణలో అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ పుప్పాల వెంకటకృష్ణ రావు, కార్యనిర్వహణ అధికారి ఆర్వివిఎస్.రామచంద్ర కుమార్ పాల్గొన్నారు.

భీమవరంలో బహిరంగ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వీరవాసరం

ఉండి నియోజకవర్గంలో పేదలపై కర్కశంగా వ్యవహరిస్తున్న ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు వైఖరిని నిరసిస్తూ భీమవరంలో ఈ నెల ఆరో తేదీన సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి పెర్కిపాలెం గ్రామస్తులకు సోమవారం దిశా నిర్దేశం చేశారు. రఘురామ కృష్ణరాజు చేస్తున్న అరాచక తత్వాన్ని నిరోధించకపోతే రానున్న రోజుల్లో ఆయన నిరంకుశ వైఖరి పెరిగిపోతుందన్నారు. ఎల్లప్పుడు ప్రజల పక్షాన్ని పోరాడే సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస్రావును దుర్భాషలాడడం వంటి పరిణామాలను ఎంతవరకూ సహించాలంటూ నరసింహమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ భీమవరం బహిరంగ సభకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొర్రా అలమహారాజు, కిలాడి సత్యనారాయణ, బొక్కా మంగారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గణపవరం : ప్రభుత్వ స్థలాల్లో పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేతను ఆపాలని, ఆరో తేదీ మంగళవారం భీమవరంలో జరిగే బహింగ సభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల నాయకులు నరాలశెట్టి రామకృష్ణ పులుపునిచ్చారు. సోమవారం కేశవరం ఉద్దరాజు నగర్ ఇళ్లస్థలాల పేదలతో సమావేశం నిర్వహించారు సమావేశంలో సత్యనారాయణ, రామకృష్ణ మాట్లాడుతూ రఘురామకృష్ణరాజు దుర్మార్గంగా పేదల ఇళ్లను ధ్వంసం చేస్తున్నారని చెప్పారు. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు భీమవరం పాత బస్టాండ్ సెంటర్లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు.

పెనుమంట్ర : డిప్యూటీ స్పీకర్ పేదల గహాలు కూల్చి వేతకుకు నిరసనగా భీమవరంలో మంగళవారం జరగనున్న సిపిఎం బహిరంభ సభకి తరలిరావాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని పొలమూరు, బ్రాహ్మణ చెర్వు, తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి సమస్యలపై పోరాడుతున్న సంగతులు వారికి తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి కోడి శ్రీనివాసప్రసాద్. పాలమూరు శాఖా సభ్యులు చింతపల్లి తిరుమలరావు, పంపన సూర్యనారాయణ, కట్ట సత్యనారాయణ పాల్గొన్నారు.

దస్తావేజులు పడిపోయినవి

లగడపాటి అన్నపూర్ణ, భర్త: సుబ్రహ్మణ్యం, కావలిపురం రోడ్, వేల్పూరు, తణుకు మండలం, వేల్పూరు గ్రామంలో 368.29 స్థలమునకు సంబంధించి డాక్యుమెంట్ల నెంబర్లు (5903/2021) జిరాక్స్ నిమిత్తం తణుకు వెళ్ళుచుండగా దారిలో పడిపోయినవి. దొరికినవారు సెల్ 7013973750కు తెలియజేయగలరు.